

బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకొని తమ ఆరోగ్యాలను రక్షించుకోవచ్చని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్ అన్నారు. శుక్రవారం రాజీవ్ నగర్‌లోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో స్కూల్ విద్యార్థులకే కాకుండా విద్యార్థుల పేరెంట్స్‌కు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, దంత వైద్య పరీక్షలు, ఆప్తమాలజీ స్క్రీనింగ్, ఈఎన్‌టీ పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శాంతి ప్రియ, అపోలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విజేందర్, రాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ రాజ్యలక్ష్మికి ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డు



అవార్డు అందుకున్న టీచర్ రాజ్యలక్ష్మి

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సహోదర స్కూల్స్ కాంప్లెక్స్ అంబర్‌పేట ఆధ్వర్యంలో సెలబ్రిటీ టీచర్ 2024లో భాగంగా 'అథెనా ఎరిస్టియా-ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డ్ ప్రదానోత్సవం నిర్వహించారు. బహదూర్‌పల్లిలోని ది క్రిక్ ప్లానెట్ స్కూల్ వీనస్ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన ఈ అవార్డుల కార్యక్రమంలో యూసుఫ్‌గూడకు చెందిన మహాత్మా గాంధీ మెమోరియల్(ఎంజీఎం) స్కూల్‌లో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయురాలిగా చేస్తున్న ఉప్పాడ రాజ్యలక్ష్మీ ఇన్‌స్పైరింగ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఎంతో సహకారం అందించి అవార్డు రావటానికి ప్రోత్సహించిన పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఎం. నాయుడుకు ధన్యావాదాలు తెలిపారు.

దస్తకార్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024 ప్రారంభం



ఉత్పత్తులను పరిశీలిస్తున్న టాలీవుడ్ డైరెక్టర్ సంజనారెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ ప్రియుల అభిరుచికి తగ్గట్టుగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12 కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దస్తకార్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024 శుక్రవారం టాలీవుడ్ డైరెక్టర్ సంజనా రెడ్డి, నిర్వాహకులు జితేందర్ త్యాగి, సోమనాథ్ బౌమిక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజనా రెడ్డి మాట్లాడుతూ కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం, అంకితభావాన్ని చెబుతుందన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అన్నారు. జితేందర్ త్యాగి మాట్లాడుతూ చీరలు, స్కార్ఫ్‌లు, దుస్తులు, గృహ వస్త్రాలతో పాటు అనేక రకాల చేనేత ఉత్పత్తులను, సాంప్రదాయ పద్ధతుల్లో కార్మికులు నైపుణ్యంతో రూపొందించారన్నారు. సోమ్‌నాథ్ బౌమిక్ మాట్లాడుతూ చేనేత కారులను ప్రోత్సహించేందుకు ఎక్స్‌పోను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జామ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి, జ్యువెలరీ మొదలైన వాటిలో మొదలైన ఉత్పత్తులతో కూడిన ప్రదర్శన ఈ నెల 25 వరకు కొనసాగుతుందని చెప్పారు.



మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ సాయినాథ్ రెడ్డిలను సన్మానిస్తున్న మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు

మధురానగర్ కాలనీలో పెట్రోలింగ్ పెంచాలి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లోని మధురానగర్ కాలనీలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావులు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో శుక్రవారం వారు మధురానగర్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్, ఎస్ఐ సాయినాథ్ రెడ్డిలను అభినందించారు. తమ కాలనీ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. రాత్రి వేళలలో తమ కాలనీకి సంబంధం లేని వ్యక్తులు వచ్చి రహదారులలో తిష్ట వేస్తున్నారని అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట సమితి ఉపాధ్యక్షుడు మనోహర్ రావు, కోశాధికారి కె.సుగుణ, సంయుక్త కార్యదర్శి ఎస్.హనుమంతరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావులు ఉన్నారు.



టీపీసీసీ నూతన అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్‌ను శుక్రవారం గాంధీభవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయా రెడ్డి, - పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



సాయికుమార్ (ఫైల్)

బోరబండ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2010 బ్యాచ్‌కు చెందిన పీసీ నంబర్ 4151 ఎం.సాయికుమార్(40) గురువారం రాత్రి విధులు ముగించుకొని శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లాడు. ఛాతిలో నొప్పిగా ఉందని భార్యతో చెప్పగా భార్య తమ్ముడిని పిలిపించి వాహనంపై అమీర్‌పేటలోని ఆస్టర్‌ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్‌ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అల్లరిమూకలపై కేసు నమోదు

బోరబండ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో గొడవలు చేసిన అల్లరిమూకలపై కేసు నమోదు చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వీకర్ సెక్షన్ సైట్-3 అంబేద్కర్‌నగర్ నుంచి నిమజ్జనానికి వెళుతున్న గణపతి బోరబండ బస్టాప్ సమీపంలోకి చేరుకుంది. అప్పటికే బంజారనగర్ వినాయకుడు నిమజ్జనానికి సిద్ధంగా ఉంది. అంబేద్కర్‌నగర్, బంజారనగర్ మండప నిర్వాహకులకు మాట మాట పెరిగి ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. రెండు బస్తీలకు చెందిన 12 మందిపై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ ఎస్‌వీ.శేఖర్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన 200 మంది చోదకులపై కేసులు**



రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ స్వయంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 200 మంది వాహనదారులు నిబంధనలను పాటించకుండా రాంగ్‌రూట్‌లో ప్రమాదకరంగా డ్రైవ్ చేస్తున్నట్లు గుర్తించారు. వారందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొంత దూరమే కదా ఏమవుతుందిలే అనే ఉద్దేశంతో చాలా మంది రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్నారని దీన్ని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీరి వల్ల పక్క వారికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాంగ్‌రూట్‌లో వచ్చే వారి వాహనాలపై కేసులు పెట్టి సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. సరైన డాక్యుమెంట్లు చూపించిన అనంతరం చలానాతో పాటు ట్రోయింగ్ వాహనం ఖర్చు కూడా వాహన దారుడి వద్ద నుంచి వసూలు చేయనున్నట్లు తెలిపారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలకు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

మద్యం మత్తులో వైద్యురాలిని దూషించిన అగంతకులు

- **అడ్డుకోబోయిన హోం గార్డుకు బెదిరింపులు**

పంజాగుట్ట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ అత్యవసర విభాగంలో డ్యూటీలో ఉన్న వైద్యురాలిని మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అసభ్య పదజాలంతో దూషించారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెల్లవారుజామున 3.15 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై నిమ్స్ అత్యవసర విభాగం వద్దకు ప్రమాదంలో గాయపడ్డ స్నేహితుడిని తీసుకుని వచ్చారు. వారు అతన్ని నేరుగా అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లగా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. డ్యూటీ డాక్టర్ వచ్చి చూస్తారు అని చెప్పారు. ఇంకా ఎంత సేపు అంటూ అగంతకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యురాలు వారిని ఏమి జరిగింది, ఎలా పడ్డాడు అని వివరాలు సేకరించి, చికిత్సకు ఏర్పాట్లు చేస్తుండగా ఆమెను అసభ్య పదజాలంతో దూషించారు. గట్టిగా అరుస్తూ గొడవ చేశారు. పోలీస్ ఔట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ దామోదర్ రెడ్డి అక్కడికి వచ్చి వారిని ఆపే ప్రయత్నం చేయగా అతన్ని కూడా దూషించారు. అంతుచూస్తామని, నీ ఉద్యోగం పీకిస్తామని అతన్ని కూడా బెదిరించారు. గొడవ పెద్దదిగా అవుతుండడంతో పంజాగుట్ట పీఎస్‌కు అతను సమాచారం ఇచ్చాడు.

పెట్రో కారు సిబ్బంది, రాత్రి విధుల్లో ఉన్న ఎస్ఐ, మిగతా సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని అక్కడి నుంచి బలవంతంగా పంపించారు. దామోదర్ రెడ్డి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాల నంబర్ ఆధారంగా వారిని గుర్తించినట్లు తెలిసింది.



నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్దనమూర్తి తదితరులు

విశ్వనాథ సత్యనారాయణకు ఘన నివాళి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథ సత్యనారాయణ దేశ సాహిత్య చరిత్రలో శిఖరం వంటి వారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గానసభలో శుక్రవారం రాత్రి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలుగు భాషలోనే విశ్వనాథ సత్యనారాయణ రచనలు అధికంగా చేసినప్పటికీ దేశ సాహిత్య చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విశ్వనాథ రచించిన వేయిపడగలు నవలను మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సహస్రఫణ్ పేరుతో హిందీ భాషలోకి అనువదించి దేశ స్థాయిలో తెలుగు సాహిత్య ప్రతిష్టను పెంచారన్నారు. గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

భావతరంగాలు పుస్తకావిష్కరణ

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రచయిత ఉదయపురి మధుమోహన్ రచించిన భావతరంగాలు పుస్తకావిష్కరణ సభ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిపాటి వెంకటాచలం, సిరివెన్నెల, వేటూరి వంటి వివిధ కవులు జీవితంలో వారు పడిన శ్రమ, రాసిన కవిత్వాలు, కథలు సమాజానికి ఎంతగానో ఉత్తేజాన్ని ఇచ్చాయన్నారు. రచయిత వుదయపురి మధుమోహన్ మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో వాస్తవిక జీవితంలో అనుభవించిన సంఘటనలు, ఉద్యమాల ఘటనల గురించిన వివరాలు ఉన్నాయన్నారు. సోమన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



సాయిగణేష్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లి ఎస్ఐ దీక్షిత తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, మామిడాల గ్రామానికి చెందిన నల్లూరి సాయిగణేష్(24) బాగ్‌అమీర్ సుమిత్రానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో టవల్‌తో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసీఐఎల్‌లో ఉంటున్న సోదరి సౌజన్యకు విషయం తెలియగానే వెంటనే కూకట్‌పల్లి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సాయిగణేష్ బంధువుల అమ్మాయిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. మనస్పర్థలు రావడంతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఆమె ఇతరులతో మాట్లాడుతుండడంతో సాయిగణేష్‌కు నచ్చలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. పద్ధతి మార్చుకోవాలని, అనుమానిస్తే ప్రేమించడం, పెళ్లి చేసుకోవడం కుదరదని ఆమె అతడికి చెప్పింది. తనను పెళ్లి చేసుకోదేమోనని మనస్తాపం చెందిన సాయిగణేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి సోదరి సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్‌లో మహిళ..

హైదర్‌నగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన ఆకుల స్నేహ(34) కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నంబర్-3లో గల ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గురువారం రాత్రి గదిలో చున్నీతో ఉరేసుకుంది. ఆమె శుక్రవారం ఉదయం గది నుంచి బయటకు రాకపోవడంతో నిర్వాహకులకు అనుమానం వచ్చి తలుపు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'నా చావుకు ఎవరూ కారణం కాదంటూ' అందులో రాసి ఉంది. స్నేహకు గతంలో రెండు సార్లు వివాహం అయిందని, రెండూ విఫలం కావడంతో మనోవేదనతో ఆత్మహత్య చేసుకొని ఉంటుందని తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

టిప్పర్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

దుండిగల్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీపోచంపల్లికి చెందిన ముడిమ్యాల శంకరయ్య(63) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. గండిమైసమ్మ నుంచి మేడ్చల్‌కు వెళ్లే రోడ్డులో నిమంత్రం ఫంక్షన్ హాల్ వద్ద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుతో స్కూటీపై కూర్చొని మాట్లాడుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ అతడిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అతడి కుమారుడు మహేష్ ఘటనా స్థలానికి చేరుకొని తండ్రిని బహదూర్‌పల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- **కేసు నమోదు**

బంజారాహిల్స్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించిన సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బచ్చు వెంకట శివరామకృష్ణారెడ్డి అనే వ్యక్తి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36 లోని ట్రై సన్ టెక్నాలజీస్ అండ్ సర్వీసెస్ సంస్థ పేరుతో గత ఏడాది డిసెంబర్‌లో సంస్థను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో కొంతమంది నిరుద్యోగుల వద్ద నుంచి రూ.1 లక్ష నుంచి 2 లక్షల దాకా డబ్బులు వసూలు చేశారు. అయితే నెలలు గడిచినా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించకపోవడంతో పాటు జీతాలు కూడా చెల్లించడం లేదు. దీంతో పాటు తామిచ్చిన డబ్బులు సైతం తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ మేరకు స్నేహలత అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి తదితరుల మీద చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు

- **26 నుంచి 28 వరకు హైటెక్స్ ప్రాంగణంలో..**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ప్రోప్యాక్ ఎక్స్‌పో పేరుతో సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు జరగనున్నాయి. హైటెక్స్ ప్రాంగణంలో జరిగే ఈ ఎక్స్‌పోలలో 14 దేశాల నుంచి 500కు పైగా టెక్నాలజీ సప్లయర్‌లు పాల్గొంటారని మెస్సే మున్‌చెన్ ఇండియా సీఈవో భూపిందర్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఫార్మా, లేబొరేటరీ టెక్నాలజీ పరిశ్రమకు ఉపయుక్తంగా ఉంటుందన్నా రు. అధునాతన సాంకేతిక పరిష్కారాలు, ఉన్నత-స్థాయి చర్చలకు కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఇండియన్ ఎనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసోసియేషన్ (ఐఏఐఏ) ప్రెసిడెంట్ చంద్రహాస్ శెట్టి మాట్లాడుతూ అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పోతో ల్యాబ్ సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా కొనసాగుతోందన్నారు. ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హర్షిత్‌షా మాట్లాడుతూ భారతదేశపు అతిపెద్ద ఫార్మా మెషీన్ తయారీదారుల సంఘంగా, ఫార్మా కంపెనీలు, యంత్ర తయారీదారులకు మధ్య ఉన్న సవాళ్లు, భవిష్యత్తు పరిష్కారాలను చర్చించడానికి సరైన వేదికగా ఈ ప్రదర్శనలు నిలువనున్నాయని పేర్కొన్నారు.

'మనూ'లో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ యూనివర్సిటీలో అపరిశుభ్రమైన భోజనం పెడుతున్నారని, నాణ్యత లోపించిందని, విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం ఎదుట గురువారం నుంచి శుక్రవారం వరకు ఆందోళన నిర్వహించారు. వార్డెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఔషధ కేంద్రాల్లో అధికారుల తనిఖీ

- **స్టెరాయిడ్స్ స్వాధీనం**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ కోసం జిమ్‌కు వెళ్లే వారికి స్టెరాయిడ్స్‌ను అక్రమంగా సరఫరా చేస్తున్న ఓ కేంద్రంలో ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ. 2 లక్షల విలువగల మందులను స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాడీ బిల్డింగ్ కోసం మందులు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు రెండు రోజులపాటు దాడులు నిర్వహించారు. ఇసామియా బజార్‌లో అనుమతి లేకుండా రాకేష్ డిస్ట్రిబ్యూటర్ పేరుతో నడిపిస్తున్న కేంద్రంలో తనిఖీలు చేశారు. ఆండ్రోజెన్, అనిబాలిక్ స్టెరాయిడ్స్‌తో సహా 22 రకాల ఇతర స్టెరాయిడ్స్‌ను కండరాల పెరుగుదలకు బాడీ బిల్డర్లు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మియాపూర్‌లోని శ్రీకాంత్ న్యూరో సెంటర్‌లో కూడా తనిఖీ చేశారు.

డ్రగ్ లైసెన్స్ లేకుండా ఆస్పత్రిలో అక్రమంగా మెడికల్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రూ. 1.01 లక్షల విలువ గల 31 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 11 కేవీ అపోలో ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు 11 కేవీ ఎన్ఎస్‌సీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 24, కేన్సర్ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు 11 కేవీ రామానాయుడు స్టూడియో, శ్రీచైతన్య ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ అశ్విని హైట్స్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు 11 కేవీ భారతీయ విద్యా భవన్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు 11 కేవీ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14, కనకదుర్గ ఆలయం ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు 11 కేవీ సాగర్ సొసైటీ, ఫోనిక్స్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 11 కేవీ కాకతీయ హిల్స్, ఐఏఏ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10 మీనాక్షి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

గ్రీన్ ల్యాండ్స్ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు 11 కేవీ దివ్యశక్తి, డీఎస్ఎం కాలనీ, చిరాన్ ఫోర్ట్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 11 కేవీ బేగంపేట పోస్టాఫీస్, ఫతేనగర్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు బేగంపేట నాలా ఫీడర్ పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ సుందర్ నగర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, బేగంపేట కామత్ లింగాపూర్ హౌస్ ఫీడర్ల పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కేవీ సోమాజిగూడ మోనప్ప ఐలాండ్ రాజీవ్ గాంధీ విగ్రహం, సారథినగర్, బేగంపేట సూర్యోదయ కాంప్లెక్స్, పెద్దమ్మ నగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ సోమాజిగూడ కీర్తిలాల్, న్యూ శాస్త్రి నగర్, బేగంపేట మయూరి మార్గ్, ఎస్ఆర్ఆర్ పురం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

సైఫాబాద్ ఏడీఈ పరిధిలో....

మరమ్మతుల కారణంగా సైఫాబాద్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు లుంబిని పార్క్ సబ్ స్టేషన్ తెలంగాణ టూరిజం కార్యాలయం ఫీడర్ పరిధిలో, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ గాంధీనగర్, జవహర్ నగర్ బాలాజీ ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ వెంకటరమణ కాలనీ రేణుక అపార్ట్‌మెంట్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.



జలవిహార్ ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్, నాయకులు

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- **జలవిహార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి**
- **బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

పంజాగుట్ట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున హుస్సేన్‌సాగర్‌ను కబ్జాచేసి అక్రమ నిర్మాణాలను చేపట్టిన జలవిహార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జలవిహార్ ఆవరణలోని అక్రమ కట్టడాలను జేఏసీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జలవిహార్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలలో శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి జలవిహార్ నిర్వాహకులు మాత్రం నిబంధనలు అతిక్రమించి ఇష్టం వచ్చినట్లుగా శాశ్వత నిర్మాణాలు చేపట్టారని, వాటిని వెంటనే కూల్చివేయాలని హైడ్రాను కోరారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను, ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట జేఏసీ నాయకులు సురేందర్ గౌడ్, నగేష్, మల్లేష్, హరేందర్, వెంకటేష్, వీరేష్, తదితరులు ఉన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కండక్టర్, డ్రైవర్

జీడిమెట్ల, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడి ప్రాణాలు కాపాడారు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జీడిమెట్ల డిపోకు చెందిన 192/1 నంబర్ బస్సులో మురళీకృష్ణ(70) ప్రయాణిస్తున్నాడు. బస్సు ఐడీపీఎల్ డీమార్ట్ దాటగానే వృద్ధుడు గుండెపోటుతో పడిపోయాడు. గమనించిన డ్రైవర్ సైదులు, కండక్టర్ ఎం. ఆజం బస్సును ఆపి అతడికి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. మురళీకృష్ణను ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్, కండక్టర్‌ను ప్రయాణికులు అభినందించారు.

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు టీఆర్ఎస్ఎంఏ వినతి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీఆర్ఎస్ఎంఏ ప్రతినిధులు

మారేడుపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్స్ (టీఆర్ఎస్ఎంఏ) అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులు వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గవర్నమెంట్ స్కూల్స్ లేవని, తాము స్కూళ్లను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నామన్నారు. అయితే, తమను కమర్షియల్ ట్యాక్స్ పరిధిలో చేర్చి ట్యాక్స్‌లు చెల్లించాలంటూ నోటీసులు పంపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ సయాద్ అహ్మద్ ఉపాధ్యక్షుడు పవన్ పాఠక్, సుధాకర్, ప్రశాంత్, శ్రీకాంత్ రాజు ఉన్నారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బీదల బస్తీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బౌద్ధనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదల బస్తీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి ప్రారంభించారు. సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో ఈ రోడ్డు పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ దేవీ నవరాత్రుల్లోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటేరాజు, లలిత, రేవతి, సాయి, బీదలబస్తీ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సారంగపాణి తదితరులు

చిలకలగూడ, సెప్టెంబర్20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. శుక్రవారం ఆయన దూద్‌బావి పరిసర ప్రాంతాలలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సారంగపాణి మాట్లాడుతూ, మంచినీటి సరఫరా సరిగా లేదని, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా మారిందని అన్నారు. కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ కిషన్ రెడ్డి సొంత నిధులతో నిర్మిస్తున్న దూద్‌బావి కమ్యూనిటీ హాల్ 2వ అంతస్తు నిర్మాణం వేగవంతం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించగా విజయదశమి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సింగారపు సురేష్ మాదిగ, వనమాల శ్రీనివాస్, ప్రతాప్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

తన్నీరు కృష్ణకుమారికి ఓయూ డాక్టరేట్



తార్నాక, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన తన్నీరు కృష్ణకుమారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఓయూలోని సైకాలజీ విభాగం నుంచి ప్రొఫెసర్ డా. సిల్వియా ఫెర్నాండెజ్ పర్యవేక్షణలో "ఇంపాక్ట్ ఆఫ్ పర్సనాలిటీ ఆన్ అకాడమిక్ స్ట్రెస్ అండ్ సెల్ఫ్ ఎఫికసి ఎమాంగ్ కాలేజ్ స్టూడెంట్స్" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఓయూ డాక్టరేట్ ప్రకటించింది.

ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు తలసాని పరామర్శ

మారేడుపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. శ్రీగణేశ్ సోదరి విజయ బుధవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసి శ్రీగణేశ్‌కు శుక్రవారం తలసాని ఫోన్ చేసి పరామర్శించి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



ప్రత్యేక ప్రార్థనలు

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని న్యూబోయినపల్లి పెన్షన్‌లైన్‌లో ఖదర్ జెండా ఇంతెజామియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

(సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



తుకారాంగేట్ కొండారెడ్డి పార్కు వద్ద మ్యాన్‌హోల్ పగిలిపోయి ప్రమాదకరంగా మారడంతో రాత్రి సమయంలో ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అక్కడ కొత్త మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు సీహెచ్ కన్నాభిరాం అధికారులను కోరాడు.

(అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..!

● పైప్‌లైన్ నుంచి వెనక్కి వస్తున్న డ్రైనేజీ నీరు
● మురుగునీటితో నిండుతున్న ఆవరణ
● దుర్వాసనతో ఇళ్లలోని వారి అవస్థలు
● ఫిర్యాదు చేసి వారం రోజులైనా పట్టించుకోని జలమండలి అధికారులు



లోహియనగర్‌లో ఇంట్లోకి వచ్చిన మురుగునీరు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ లోహియనగర్‌లోని మూడు ఇళ్ల (ఇ.నం. 10-4-81,82,83)లోకి పదిహేను రోజులుగా డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మురుగు నీరు వెనక్కి వస్తోంది. డ్రైనేజీ పైప్‌లైన్ నుంచే కాకుండా మంచినీటి పైప్‌లైన్ నుంచి కూడా ఇలా మురికి నీరు ఇళ్లలోకి వస్తోంది. ఇంటి ఆవరణ మొత్తం మురుగునీరు చేరడంతో భరించలేని దుర్వాసన వస్తోందని, దీంతో ఇంట్లో ఉండలేకపోతున్నామని ఆయా ఇళ్లలో నివాసం ఉండేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ, నల్లా పైప్‌లైన్ల నుంచి మురుగునీరు ఇళ్లలోకి వస్తోందని వారం రోజుల క్రితం జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బస్తీవాసులు ఆరోపించారు. ప్రస్తుతం మూడు ఇళ్లలోని ఈ సమస్య ఉందని, బస్తీలోని మొత్తం ఇళ్లలో మురుగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జలమండలి అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని బస్తీవాసులు హెచ్చరిస్తున్నారు.

విద్యాప్రమాణాలను పెంపొందించడం అభినందనీయం



సదస్సులో మాట్లాడుతున్న కార్డినల్ పూల ఆంథోని

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కృషి చేస్తుండటం ప్రశంసనీయమని తెలుగు క్యాథలిక్ బిషప్ కౌన్సిలింగ్ హైదరాబాద్ అధ్యక్షుడు కార్డినల్ పూల ఆంథోని అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్ హై స్కూల్ ఆడిటోరియంలో టీసీబీసీ కమిషన్ ఫర్ ఎడ్యుకేషన్ (తెలంగాణ), క్యాథలిక్ స్కూల్స్ ఆర్కిడయోసిస్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యాప్రమాణాలు మెరుగుపరచడంపై నిర్వహించిన ఒక్క రోజు అవగాహన సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పూల ఆంథోని మాట్లాడుతూ...విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞాన పరంగా, సాంకేతిక పరంగా నూతన విధానాల ద్వారా మెరుగైన విద్యను అందించేందుకు క్యాథలిక్ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫాదర్ బాల శౌరి మాట్లాడుతూ...క్యాథలిక్ చర్చ్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో ఎన్నో విద్యాసంస్థలు కొనసాగుతున్నాయన్నారు. వాటిని మరింత బలోపేతం చేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, పరిశోధకులు హాజరై తమ సలహాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో టీసీబీసీ కమిషన్ ఫర్ ఎడ్యుకేషన్ తెలంగాణ జనరల్ సెక్రటరీ డాక్టర్ వీకే స్వామి, క్యాథలిక్ ఇనిస్టిట్యూషన్స్ జనరల్ సెక్రటరీ డాక్టర్ బ్రదర్ షాజహాన్ అంటోని తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు హెల్మెట్ అందజేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రత పై సికింద్రాబాద్‌లోని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. "రోడ్డు ప్రమాదాలు-నివారణ" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ...రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల 2024లో ఇప్పటి వరకు 2,97,000 కేసులు నమోదు కాగా ఒకరు మరణించారని, 128 మంది గాయపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బైసాని కిషోర్ బాబు, అడ్మిన్ శ్రీవాత్సవ్, హీరో మోటార్ కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్, అబ్దుల్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

'నవభారత్ నిర్మాణంలో మహిళా విద్యావేత్తల పాత్ర'పై నేడు జాతీయ సెమినార్

అంబర్‌పేట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): 'నవభారత్ నిర్మాణంలో మహిళా విద్యావేత్తల పాత్ర' అనే అంశంపై శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య జైకిషన్, డాక్టర్ ఏలూరి యాదయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధానారాయణ మూర్తి, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సయ్యాని, జేఎన్‌యూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ పండిట్, తెలంగాణ విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఏబీఆర్ఎస్ఎం జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంతా లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంల నుంచి సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు.

నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు

● 26 నుంచి 28 వరకు హైటెక్స్ ప్రాంగణంలో..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ప్రోప్యాక్ ఎక్స్‌పో పేరుతో సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు జరగనున్నాయి. హైటెక్స్ ప్రాంగణం లో జరిగే ఈ ఎక్స్‌పోలలో 14 దేశాల నుంచి 500కు పైగా టెక్నాలజీ సప్లయర్లు పాల్గొంటారని మెస్సే మున్‌చెన్ ఇండియా సీఈవో భూపిందర్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఫార్మా, లేబొరేటరీ టెక్నాలజీ పరిశ్రమకు ఉపయుక్తంగా ఉంటుందన్నా రు. అధునాతన సాంకేతిక పరిష్కారాలు, ఉన్నత-స్థాయి చర్చలకు కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఇండియన్ ఎనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసోసియేషన్ (ఐఏఐఏ) ప్రెసిడెంట్ చంద్రహాస్ శెట్టి మాట్లాడుతూ అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పోతో ల్యాబ్ సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా కొనసాగుతోందన్నారు. ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హర్షిత్‌షా మాట్లాడుతూ భారతదేశపు అతిపెద్ద ఫార్మా మెషీన్ తయారీదారుల సంఘంగా, ఫార్మా కంపెనీలు, యంత్ర తయారీదారులకు మధ్య ఉన్న సవాళ్లు, భవిష్యత్తు పరిష్కారాలను చర్చించడానికి సరైన వేదికగా ఈ ప్రదర్శనలు నిలువనున్నాయని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ స్వయంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 200 మంది వాహనదారులు నిబంధనలను పాటించకుండా రాంగ్‌రూట్‌లో ప్రమాదకరంగా డ్రైవ్ చేస్తున్నట్లు గుర్తించారు. వారందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొంత దూరమే కదా ఏమవుతుందిలే అనే ఉద్దేశంతో చాలా మంది రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్నారని దీన్ని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీరి వల్ల పక్క వారికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

దీన్ని దృష్టిలో ఉంచుకొని డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాంగ్‌రూట్‌లో వచ్చే వారి వాహనాలపై కేసులు పెట్టి సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. సరైన డాక్యుమెంట్లు చూపించిన అనంతరం చలానాతో పాటు ట్రోయింగ్ వాహనం ఖర్చు కూడా వాహన దారుడి వద్ద నుంచి వసూలు చేయనున్నట్లు తెలిపారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలకు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.



అధికారులతో సమావేశమైన జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జెడ్సీ రవికిరణ్

ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయండి

● జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లను వేగిరం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను జీహెచ్ఎంసీ సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆదేశించారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్లలోని వివిధ సర్కిళ్ల ఉప కమిషనర్లు, ట్యాక్స్ సెక్షన్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2023 సెప్టెంబర్ కాలంలో సికింద్రాబాద్ జోన్‌లో 156 కోట్ల రూపాయిలు, ఖైరతాబాద్ జోన్‌లో 272 కోట్ల రూపాయిలు ఆస్తిపన్ను వసూలైనట్లు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు సికింద్రాబాద్ జోన్‌లో రూ. 166 కోట్లు, ఖైరతాబాద్ జోన్‌లో రూ. 281 కోట్లు వసూలైందన్నారు. ఈనెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రవికిరణ్ అధికారులను ఆదేశించారు. వివిధ సర్కిళ్ల ఉపకమిషనర్లు ఖదీర్, ఏ.మారుతి దివాకర్, రాజు, సుభాష్‌రావు, సమ్మయ్య, రజనీకాంత్‌రెడ్డి, ప్రశాంతి, నాగేశ్వర్, విద్యాధర్‌లతోపాటు అసిస్టెంట్ కమిషనర్లు సమావేశంలో పాల్గొన్నారు.

మహిళా బాక్సర్‌కు సత్కారం



బాక్సర్ అయేషాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని సాధించిన సయ్యద్ అయేషాను సికింద్రాబాద్ నియోజకవర్గ శాసన సభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ సత్కరించారు. శుక్రవారం సీతాఫల్‌మండి లోని కార్యాలయంలో సయ్యద్ అయేషా, కోచ్ మనోజ్‌రెడ్డిలు పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఇలా ఉండగా, అక్టోబర్ 3వ తేదీ నుంచి నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొవాలని సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసి ఆహ్వానించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం



విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా డెంటల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ బానోతు లాలూ, లయన్ నారాయణలు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దంత సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డెంటల్ వైద్యులతో ప్రత్యేక శిబిరం నిర్వహించి విద్యార్థులకు అవసరమైన చికిత్సతోపాటు మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కాగా, బోయిన్‌పల్లిలో రెండు ఆశ్రమ పాఠశాలల్లోని సుమారు 250 మంది విద్యార్థులకు ఈ శిబిరంలో దంత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏబీవీపీ విద్యార్థుల దాడిని ఖండిస్తున్న దళిత, బహుజన, వామపక్ష విద్యార్థి నాయకులు

ఏబీవీపీ విద్యార్థులను వెంటనే అరెస్టు చేయాలి

● దళిత, బహుజన, వామపక్ష విద్యార్థి నాయకుల డిమాండ్

తార్నాక, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీల వివాదంలో ఓయూ విద్యార్థి నాయకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఏబీవీపీ విద్యార్థులను వెంటనే అరెస్టు చేయాలని దళిత, బహుజన, వామపక్ష విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థి నాయకులు యెన్నం శ్రీకాంత్ యాదవ్, పల్లపు చందుపై ఏబీవీపీ విద్యార్థుల దాడిని నిరసిస్తూ శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో దళిత, బహుజన, వామపక్ష విద్యార్థి నాయకులు నిరసన వ్యక్తం చేసి దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏబీవీపీ విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీలో అకడమిక్ వాతావరణాన్ని చెడగొట్టేలా ఇతర విద్యార్థి సంఘాల నాయకులపై భౌతిక దాడులకు పాల్పడటం హేయమన్నారు. ఓయూలో ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు దాడికి పాల్పడిన ఏబీవీపీ విద్యార్థులను చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయూ విద్యార్థి నాయకులు ఎన్. సుమంత్, రవినాయక్, కోట శ్రీనివాస్ గౌడ్, వలిగొండ నర్సింహ, ఆజాద్, చటారి దశరథ్, నేముల శేషు, శరత్ నాయక్, స్వామిగౌడ్, తాళ్ల అజయ్ కుమార్, రంజిత్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ స్థలంలోని అక్రమ నిర్మాణాల కూల్చివేత

● పోలీసుల సహకారంతో కూల్చివేసిన కంటోన్మెంట్ బోర్డు అధికారులు



బోయిన్‌పల్లిలో మిలటరీ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన దృశ్యం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధి బోయిన్‌పల్లిలోని మేడ్చల్ జాతీయ రహదారిలో మిలటరీ స్థలంలో కొందరు స్థానిక నేతల అండదండలతో వెలిసిన అక్రమ నిర్మాణాలపై కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఒకట్రెండు కాదు... ఏకంగా పదుల సంఖ్యలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో శుక్రవారం కూల్చివేతలు ప్రారంభించారు. అయితే కూల్చివేతలను ఆపాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్టు తెలిసింది. అయితే, ఎలాంటి ఒత్తిళ్లను లెక్క చేయని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు. మిలటరీ స్థలాన్ని ఆక్రమించి అందులో నిర్మాణాలు చేపట్టడంతో పాటు షెడ్లు వేసి వ్యాపారులు చేస్తున్న వారు రోడ్డును కూడా ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. సీఈఓ ఆదేశాలు, మరో పక్క అక్రమ వ్యాపారాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుండటంతో బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తినేని రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులు తమ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. శనివారం కూడా మరిన్ని కూల్చివేతలు కొనసాగుతాయని కంటోన్మెంట్ బోర్డు అధికారులు వెల్లడించారు.

ఉపేక్షించేది లేదు

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తినేని రవికుమార్

రోడ్ల పక్కన ఎవరైనా ఆక్రమణలకు పాల్పడినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేదిలేదని బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తినేని రవికుమార్ స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వ్యాపారాలు కొనసాగించినా, రోడ్లను, ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా కఠిన చర్యలు తీసుకోవాలన్న సీపీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. బోయిన్‌పల్లిలోని మేడ్చల్ జాతీయ రహదారిలో ఉన్న మిలటరీ స్థలంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామన్నారు.

అక్రమార్కులకు వరంగా 'బోర్డు' అధికారుల అలసత్వం

● అక్రమార్కులకు నిదర్శనం వంటిల్లు రెస్టారెంట్
● ఆర్మీ స్థలంలో మేడ్చల్ జిల్లా అధికారులు ఫుడ్ లైసెన్స్, లేబర్ లైసెన్స్ జారీ

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు అధికారుల అలసత్వం అక్రమార్కులకు వరంగా మారింది. ఏకంగా రక్షణశాఖ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు భారీ స్థాయిలో వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో గతంలో బోర్డు అధికారులు అప్పటి సీఈఓ సుజాత గుప్తా ఆధ్వర్యంలో కూల్చేసిన అక్రమ నిర్మాణాల స్థానంలో కొత్తవి వెలిశాయి. పలు దుకాణాలతో పాటు తాజాగా వంటిల్లు పేరిట ఓ రెస్టారెంట్ ఏర్పాటైంది. రక్షణ స్థలంలో వెలిసిన ఈ రెస్టారెంట్ తమ పరిధిలోకి వస్తుందో లేదో కూడా పరిశీలించకుండానే మేడ్చల్ జిల్లా అధికారులు ఫుడ్ లైసెన్స్, లేబర్ లైసెన్స్‌లు జారీ చేశారు. కొందరు దళారుల ప్రమేయంతో ఈ అక్రమ వ్యాపారాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



బోర్డు అధికారులు కూల్చివేతలు చేపడుతుండగానే మరోపక్కన సాగిస్తున్న అక్రమ నిర్మాణాలు

ఓ వైపు కూల్చివేతలు..మరోవైపు నిర్మాణాలు

కంటోన్మెంట్ బోర్డు అధికారులు ట్రాఫిక్ పోలీసులు కలిసి శుక్రవారం ఎన్‌హెచ్-44పై వెలిసిన అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టారు. బోయిన్‌పల్లి చెక్‌పోస్టు నుంచి సుచిత్ర వరకు వెలిసిన చిరు వ్యాపారుల దుకాణాలపై చర్యలు తీసుకున్న అధికారులు బడా వ్యాపారుల విషయంలో మాత్రం ద్వంద్వ వైఖరి అవలంభించడం గమనార్హం. ఓ వైపు బోర్డు అధికారులు కూల్చివేతలు కొనసాగిస్తుండగా మరోపక్క అక్రమ నిర్మాణాలు కొనసాగుతూ ఉండడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. చిరు వ్యాపారులపై కొరడా ఝుళిపించిన బోర్డు అధికారులు డిఫెన్స్ ల్యాండ్‌లో నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది.